తప్పుడు కేసులే రేవంత్ ఫార్ములా!

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నారు. ఆ ప్రశ్నలను కూడా ఓర్వలేకపోతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేతలను వరుస కేసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. కేవలం తన 18 నెలల పాలనలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏకంగా 14 అక్రమ కేసులు పెట్టించారంటే ప్రతిపక్షం ప్రశ్నలకు ఆయన ఎంతలా భయపడుతున్నారో ఇట్టే అర్థమవుతున్నదని పేర్కొంటున్నారు. దీనికి తోడు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను, మాజీ మంత్రి హరీశ్‌రావును కాళేశ్వరం కమిషన్ పేరిట వేధింపులకు గురిచేస్తున్నారని, ప్రపంచం మొత్తం గర్వించదగిన కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రపంచం మొత్తం సంబురంగా కొనియాడిన ఫార్ములా-ఈ రేస్‌లో లేని అవినీతిని అంటగట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పడుతున్న తాపత్రయం అంతా ఇంతా కాదని అంటున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ ముఖ్యనేతలను టార్గెట్ చేసుకున్న సీఎం.. ఏదో విధంగా వారిని ప్రజల్లో దోషులుగా నిలబెట్టేందుకు విఫలయత్నాలు చేస్తూనే ఉన్నారు.

ఫార్ములా-ఈ కేసుతో ఇబ్బందిపెట్టే కుట్ర

మన దేశంలోనే తొలిసారిగా తెలంగాణకు ఫార్ములా-ఈ కార్ రేస్‌ను తీసుకొచ్చేందుకు నాడు మున్సిపల్‌శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. దేశ, విదేశాల్లో ఎఫ్ఐఏ నిర్వహకులను ఒప్పించి.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫార్ములా-ఈ కార్ రేస్‌ను తెలంగాణలో నిర్వహించారు. ఈ కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిగట్టుకొని మరీ కేటీఆర్‌కు లేని అవినీతిని అంటగట్టి, ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రేసు నిర్వహణలో అవినీతి అంటూ కేవలం రాజకీయ కక్షతో, ఊహాజనితంగా ముందుకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కేటీఆర్‌పై కేసు కూడా పెట్టించారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టనట్టు ఆఖరికి 18 నెలల్లో ఏమీ తేల్చలేకపోయారు. తన పదునైన ప్రశ్నాస్త్రాలతో.. సీఎం రేవంత్‌రెడ్డి పంటికింద రాయిలా మారిన కేటీఆర్‌ను ఎలాగైనా జైలుకు పంపేందుకు ఈ కేసును ఆయుధంగా చేసుకొని, ఏసీబీ అధికారులతో విచారణ చేయిస్తున్నారు.

ఎలక్ట్రిక్ వాహన రంగానికి ఊతమిచ్చేలా..

వాతావరణంలో ఎలాంటి కాలుష్యం లేకుండా ఎలక్ట్రిక్ బ్యాటరీలతో ఈ కార్లు నడుస్తాయి. జీరో కర్బన ఉద్గారాల విడుదల అనేది ఫార్ములా-ఈ రేసింగ్ ప్రత్యేకత. ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లో రేసింగ్‌లు నిర్వహించడం ద్వారా ఫార్ములా-ఈ రేసింగ్‌కు మరింత ఆదరణ పెరిగింది. దీనికి తోడు భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగానికి మంచి తోడ్పాటు అందించేందుకు ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. అయితే, ఈ రేసులు నగరంలో నిర్వహించి అంతర్జాతీయంగా హైదరాబాద్ బ్రాండ్‌ను పెంచాలని నాటి పురపాలక శాఖ మంత్రిగా కేటీఆర్ తపనపడ్డారు. నాటి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్‌తో కలిసి కసరత్తు చేసి, హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను ఎఫ్ఐఏ నిర్వాహకులకు చెప్పి ఒప్పించడంతో దేశంలోనే తొలిసారిగా నాడు ఫార్ములా-ఈ కార్ రేసు హైదరాబాద్‌కు వచ్చింది. ఈ రేస్‌ను ప్రపంచవ్యాప్తంగా ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటో మొబైల్స్ (ఎఫ్ఐఏ) నిర్వహిస్తుంటుంది. హైదరాబాద్‌లో 2023 ఫిబ్రవరి 23 నుంచి నిర్వహించిన ఫార్ములా-ఈ రేసులో మొత్తం 11 జట్ల నుంచి 22 కార్లు బరిలోకి దిగాయి. ప్రఖ్యాత రేసింగ్ కంపెనీలుగా పేరొందిన మెక్లారెన్, మసారెటీ, పోశె, జాగ్వార్, నిస్సాన్, మహీంద్రా రేసింగ్ కార్లు పోటీపడ్డాయి. గంటకు 322 కి.మీ వేగంతో దూసుకుపోయే జెన్-3 ఎరా కారు రేసింగ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ నిర్వహించడంతో ప్రపంచవ్యాప్తంగా రేసింగ్ ప్రియులు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల రాజకీయ నేతలు, బాలీవుడ్, టాలీవుడ్ సినీ ప్రముఖులు హాజరయ్యారు.

700 కోట్ల ప్రయోజనం

ఫార్ములా-ఈ రేసు హైదరాబాద్ నగర ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపినట్టు 'నీల్సన్ స్పోర్ట్స్ అనాలసిస్' తన అధ్యయనంలో వెల్లడించింది. ఫార్ములా- ఈ రేసు నిర్వహణతో నగర ఆర్థిక వ్యవస్థ రూ.700 కోట్ల మేర పుంజుకున్నదని, దేశంలో మరే ఇతర మెట్రో నగరానికి దక్కని ఘనతను హైదరాబాద్ సాధించిందని ఈ నివేదిక పేర్కొన్నది. కాగా, ఈ రేస్‌కు సంబంధించి 2024 ఫిబ్రవరిలో రేస్ నిర్వహించాల్సి ఉండగా.. సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి ఆ ఒప్పందాలన్నీ రద్దు చేసుకున్నారు. దీంతో ఆ రేస్‌ను మరో చోటికి మార్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రేసు నుంచి వైదొలగడంతోనే ఆ కంపెనీకి కట్టిన డబ్బులు రాలేదు. అదే రేసు నిర్వహించి ఉంటే రాష్ట్ర ఖ్యాతి ఇనుమడించడంతోపాటు తెలంగాణలో పర్యావరణహిత వాహన తయారీ పరిశ్రమలు కూడా వచ్చేవి. తెలంగాణకు దీర్ఘకాలిక లబ్ధి చేకూరేది.

రాష్ట్ర ప్రతిష్టను పెంచిన 'రేస్'.. ముంచిన మిస్ వరల్డ్ పోటీలు

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దిన కేసీఆర్ దూరదృష్టితోనే హైదరాబాద్‌కు నాడు ఫార్ములా-ఈ, మొన్న మిస్ వరల్డ్ వంటి ప్రతిష్టాత్మక పోటీలు వచ్చాయి. ఈ రెండు ఈవెంట్లతో ప్రపంచ దేశాలు తెలంగాణ రాజధాని వైపు చూశాయి. అయితే ఫార్ములా -ఈ రేసు నిర్వహణలో ఎలాంటి తప్పులు జరగకపోగా.. వందల కోట్ల ఆదాయం వచ్చింది. ప్రపంచంలోనే టాప్ నగరాలుగా పేరున్న దేశాలు.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన రేస్, తమ దేశాల అతిథులు, రేసర్లకు చేసిన ఏర్పాట్ల గురించి విశ్వవేదికలపైనే ఎంతో గొప్పగా చెప్పాయి. సినిమా, కళా రంగాల వారు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు అనేక మంది హైదరాబాద్‌కు వచ్చి ఈ-రేస్‌ను చూశారు. రేస్ జరిగిన తీరుపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమాన్ని కీర్తిస్తూ అంతర్జాతీయంగా అనేక మీడియా సంస్థల్లో వార్తలు కూడా వచ్చాయి. తెలంగాణకు పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ తదుపరి వ్యాపార గమ్యస్థానంగా తెలంగాణను ఎన్నుకుంటామని కూడా ప్రకటించారు. అయితే, ఈ-రేస్ నిర్వహణలో అవినీతి అంటూ కేటీఆర్‌పై కేవలం రాజకీయ కక్షతో ఊహాజనితంగా ముందుకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కేసు పెట్టించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 కోట్లకు పైగా ఖర్చు చేసి మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించింది. అందాల పోటీల నిర్వహణతో తెలంగాణకు భారీ ఎత్తున పెట్టుబడులు వస్తాయని గొప్పలు చెప్పింది. కానీ, పోటీల నిర్వహణలో అడ్డగోలుగా వ్యవహరించింది. దీంతో అందాల పోటీలు తెలంగాణను అంతర్జాతీయ సమాజం ముందు తలదించుకునేలా చేశాయి. తెలంగాణ ఖ్యాతి అంతర్జాతీయంగా గంగలో కలిసింది. తనతో మిస్ బిహేవ్ చేశారని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ అంతర్జాతీయ మీడియాకు చెప్పారు. మిస్ ఇంగ్లాండ్ చెప్పిన మాటల ఆధారంగా చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో పెండ్లి వేడుకలు హాజరవడం ఎన్నో అనుమానాలకు తావిచ్చింది. దీనికి తోడు ఆ ఈవెంట్‌ను నిర్వహించిన ఓ ఐఏఎస్ అధికారి.. నిబంధనలకు విరుద్ధంగా ఈవెంట్ మధ్యలోనే థాయ్‌లాండ్‌కు వెళ్లడం, ఆ తర్వాత ఆ దేశానికి చెందిన యువతిని ఎంపిక చేయడంపై ఎన్నో అనుమానాలు తలెత్తాయి. ఇవన్నీ ఒకెత్తయితే రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల నిర్వహణతో తెలంగాణకు రూ.వేల కోట్ల విలువైన పెట్టుబడులు వస్తాయంటూ చేసిన ప్రకటన ఉత్తదే అని తేలిపోయింది. పెట్టుబడులు రాకపోగా రాష్ట్రం పరువు గంగలో కలిసింది. దీంతో రాజకీయ విశ్లేషకులు నాటి ఫార్ములా ఈ రేసు, నేటి అందాల పోటీని పోల్చి చెప్తున్నారు. నాడు వందల కోట్లు వచ్చిన రేస్‌ను పక్కన పెట్టి.. ఇటీవల రూపాయి ఆదాయం రాని అందాల పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. పెట్టిన ఖర్చు కూడా రాకపోవడంతో అందాల పోటీలు కాస్తా అభాసుపాలయ్యాయి.

సోషల్ మీడియాలో కేటీఆర్ పెట్టిన పోస్టులపై కేసులు

తేదీ	ఎఫ్ఐఆర్	పోలీస్‌స్టేషన్
21 ఆగస్టు 2024	321/2024	సైఫాబాద్
14 అక్టోబర్ 2024	205/2024	ఉట్నూర్
15 మార్చి 2025	151/2025	మొయినాబాద్
25 మార్చి 2025	85/2025	నకిరేకల్
25 మార్చి 2025	86/2025	నకిరేకల్
25 మార్చి 2025	87/2025	నకిరేకల్

18 నెలల పాలనలో కేటీఆర్‌పై 14 కేసులు..

'మాది ప్రజా పాలన.. ప్రజల వద్దకు పాలన' అంటూ నిత్యం ఢాంబికాలకు పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిపక్షం సంధించే ఒక్క ప్రశ్నను కూడా తట్టుకోలేకపోతున్నది. వాట్సాప్‌లో షేర్ చేసినా, ట్విటర్ (ఎక్స్)లో పోస్టు పెట్టినా.. ఫేస్‌బుక్‌లో కామెంట్లు చేసినా అక్రమ కేసులు పెడుతూనే ఉన్నది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్ సర్కారు 18నెలల్లో 14 అక్రమ కేసులు బనాయించింది. ముఖ్యమంత్రిని 'చీప్ మినిస్టర్' అని కేటీఆర్ అన్నందుకు సైఫాబాద్‌లో కేసు నమోదు చేశారంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఆఖరుకు ఎవరైనా హరీశ్‌రావు, కేటీఆర్ డీపీలు పెట్టుకొని పోస్టులు పెట్టినా కూడా కేటీఆర్, హరీశ్‌రావులపైనే కేసులు నమోదు చేయిస్తున్నది. ఇప్పటికే హరీశ్‌రావుపై 7 అక్రమ కేసులు పెట్టించారు. కిందిస్థాయి నేతలపైనా సీఎం రేవంత్‌రెడ్డి వరుస కేసులు పెట్టిస్తున్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై 28కి పైగా కేసులు, మన్నె క్రిశాంక్‌పై 15 కేసులు, డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌పై 25 కేసులు పెట్టించారు. ఇక బీఆర్ఎస్ సోషల్ మీడియా సైనికులపై ఎక్కడో ఒకచోట రోజుకో కేసు నమోదవుతూనే ఉన్నది.

కేటీఆర్‌పై నమోదు చేసిన కేసులు, నోటీసుల వివరాలు

1) ఫార్ములా-ఈ రేస్ విషయంలో ఏసీబీ, ఈడీ కేసులు
2) తప్పుడు ప్రచారం చేశారని బోడుప్పల్‌లో తీన్మార్ మల్లన్న ఫిర్యాదు.. కేటీఆర్, జగదీశ్‌రెడ్డిపై కేసు
3) చార్మినార్ వద్ద తెలంగాణ చిహ్నంలో చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించొద్దంటూ నిరసన చేపట్టినందుకు అనుమతి లేకుండా ఆందోళన చేశారని కేటీఆర్‌పై కేసు
4) తెలంగాణ అమర వీరుల స్మారక చిహ్నం వద్ద డ్రోన్ ఎగురవేశారని కేసు
5) మంత్రి సురేఖ, తాను ఉన్న ఫొటోలను తప్పుడు ప్రచారానికి వాడుకున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు మేరకు కేటీఆర్, హరీశ్‌రావుపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు

6) మేడిగడ్డ బరాజ్‌పై డ్రోన్ ఎగురవేశారని భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్, బాల్కసుమన్, గండ్ర వెంకటరమణా రెడ్డిపై కేసు
7) ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ముషీరాబాద్ పీఎస్‌లో కేటీఆర్‌పై కేసు
8) ముఖ్యమంత్రిని 'చీప్ మినిస్టర్' అన్నందుకు సైఫాబాద్‌లో కేటీఆర్‌పై కేసు
9) మహారాష్ట్ర ఎన్నికలు, మూసీ ప్రాజెక్టుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఉట్నూర్ పీఎస్‌లో కేసు
10) అమృత్ టెండర్లకు సంబంధించి సృజన్‌రెడ్డిపై చేసిన ఆరోపణలకు కేటీఆర్‌కు లీగల్ నోటీసులు
11) 2024 మార్చిలో ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కేటీఆర్‌పై హన్మకొండలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు.. బంజారాహిల్స్ పీఎస్‌కు బదలాయింపు.. దానిపై 504, 505(2) సెక్షన్ల కింద కేసులు
12) లగచర్లలో ఫార్మాసిటీ రద్దు కోసం పోరాడిన పట్నం నరేందర్‌రెడ్డి చెప్పని విషయాలను కేటీఆర్‌కు సంబంధం ఉన్నట్టు ప్రభుత్వం కట్టుకథ అల్లి ఇరికించే ప్రయత్నం
13) ఫార్ములా -ఈ కార్ రేస్‌పై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ అనంతరం ఇంటికి వెళ్తున్న కేటీఆర్‌ను కార్యకర్తలు ర్యాలీగా తీసుకెళ్లగా ట్రాఫిక్ ఎస్సై గోవర్ధన్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేటీఆర్‌తో పాటు గెల్లు శ్రీనివాస్ యాదవ్, క్రిశాంక్, జైసింహ, మన్నె గోవర్ధన్‌పై కేసు నమోదు
14) సీఎం ఫొటోలను మార్ఫింగ్ చేశారనే అభియోగంపై మొయినాబాద్ పీఎస్‌లో కేటీఆర్‌పై కేసు
15) సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇచ్చిన ఫిర్యాదుతో కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డిపై సైబర్ క్రైమ్ పీఎస్‌లో కేసు

ఫార్ములా-ఈ రేస్ కేసు.. ప్రశ్నలు-సమాధానాలు

1) ఫార్ములా-ఈ రేస్ అంటే ఏంటి?

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పదేండ్లుగా వివిధ దేశాల్లో స్ట్రీట్ సర్క్యూట్లల్లో ఫార్ములా-ఈ కార్ రేసులు నిర్వహిస్తున్నారు.

2)ఇప్పటివరకు రేసులెక్కడ జరిగాయి?

లండన్, బీజింగ్, సియోల్, మాస్కో, బెర్లిన్, షాంఘై, జకార్తా వంటి నగరాల్లో వందకుపైగా రేసులు నిర్వహించారు.

3) ఫార్ములా-ఈ రేస్ వల్ల లాభాలేంటి?

ఫార్ములా-ఈ రేస్ జరిగిన ప్రదేశాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వృద్ధి రేటు 700 శాతానికి పైగా పెరిగింది. ఆయా దేశాల బ్రాండ్ ఇమేజ్, టూరిజం ఆదాయం పెరిగి ఆర్థికాభివృద్ధి మెరుగైంది. పలు సీజన్లలో సుమారు 50 కోట్ల మంది పోటీలను వీక్షించారు. నెట్‌జీరో కార్బన్ ఘనత సాధించిన మొదటి క్రీడ ఈ ఫార్ములా-ఈ రేస్. హైదరాబాద్‌కు 700 కోట్ల ఆదాయం వచ్చింది.

4) హైదరాబాద్‌కు రేస్ ఎలా వచ్చింది?

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో ముందు వరుసలో ఉన్న హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేందుకు, ప్రపంచవ్యాప్త గుర్తింపు తేవడానికి అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ చొరవతో ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులు హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్నారు. రాబోయే సీజన్లలో మరిన్ని రేసులు నిర్వహించేందుకు ఫార్ములా-ఈ నిర్వాహకులతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది.

5)హైదరాబాద్‌కే రేస్ ఎందుకొచ్చింది?

పర్యావరణ పరిరక్షణకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు రేస్ నిర్వాహకులను ఆకర్షించాయి. వరుసగా ఐదుసార్లు హైదరాబాద్ మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు, వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్ 2022 గెలుచుకోవడం, హరితహారం ద్వారా 6.5 కోట్ల మొక్కలు నాటడం, తెలంగాణవ్యాప్తంగా గ్రీన్ కవర్ పెంపు ఘనతలు హైదరాబాద్‌లో రేస్ నిర్వహణకు కారణంగా నిలిచాయి.

6) రేస్ ఎందుకు నిర్వహించారు?

పెట్టుబడుల ఆకర్షణ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో తెలంగాణను హబ్‌గా మార్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ-మొబిలిటీ వీక్ నిర్వహించింది. ఈ వారోత్సవాల్లో భాగంగానే ఫార్ములా-ఈ రేస్ నిర్వహించింది. ఈ సందర్భంగా హ్యుందాయ్, అమరరాజా వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ప్రకటించాయి.

7) ఫార్ములా-ఈ రేస్‌కు సంబంధించిన రూ. 55 కోట్ల డబ్బును కేటీఆర్ దుర్వినియోగం చేశారా?

అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే కేవలం రేస్ నిర్వహణ కోసమే పారదర్శకంగా ఒక ప్రభుత్వ బ్యాంక్ ద్వారా 55 కోట్ల రూపాయలను హెచ్ఎండీఏ నుంచి రేస్ నిర్వాహకులకు బదిలీ చేశారు. ఆయన ఎక్కడా అవినీతికి పాల్పడలేదు.

8) అసలు హెచ్ఎండీఏ డబ్బులు ఎందుకు బదిలీ చేసింది?

ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో తెలంగాణ ప్రభుత్వం నాలుగేండ్ల ఒప్పందం కుదుర్చుకున్నది. మొదటి సంవత్సరం గ్రీన్ కో నుంచి స్పాన్సర్‌షిప్ పొందింది. 2024 ఫిబ్రవరిలో రెండో రేస్‌కు స్పాన్సర్‌షిప్ సమస్యలు తలెత్తాయి.2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. స్పాన్సర్లు లేకుండా రేస్ నిర్వహించలేమని సంస్థ ప్రతినిధులు చెప్పటంతో మంత్రి కేటీఆర్ తదుపరి రేస్ నిర్వహణకు స్పాన్సర్ షిప్‌లను పొందుతామని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. రేస్ వేరే నగరాలకు వెళ్లకూడదన్న ఉద్దేశంతో హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లను తాత్కాలికంగా నిర్వాహకులకు బదిలీ చేయించారు.

9) హెచ్ఎండీఏకు డబ్బులు బదిలీ చేసే అధికారం ఉన్నదా?

ఫార్ములా-ఈ రేస్‌కు హెచ్ఎండీఏ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించింది. రేస్ విజయవంతం అవ్వాలన్న ఉద్దేశంతోనే కేటీఆర్ ఆదేశాలతోనే, పరిధికి లోబడే హెచ్ఎండీఏ 55 కోట్లను ఫార్ములా-ఈ నిర్వాహకులకు బదిలీ చేసింది. వాస్తవానికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా, మున్సిపల్ శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా ఉండే హెచ్ఎండీఏ ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థ. హెచ్ఎండీఏ నిధులు వాడుకోవడానికి రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి ఆమోదం అవసరం లేదు.

10) ఎలక్షన్ కోడ్ ఉన్నప్పుడు డబ్బు బదిలీ ఎలా జరిగింది?

ఎన్నికల కోడ్ అనేది.. కోడ్ ఉన్న సమయంలో ఏదైనా కొత్తగా ప్రారంభిస్తే వర్తిస్తుంది. ఈ రేసు ఒప్పందం 2022లో చేసుకున్నదే. అప్పటికే కొనసాగుతున్న వాటికి ఎన్నికల కోడ్‌తో సంబంధం లేదు. కోడ్ ఉల్లంఘన జరిగితే కేసు వేయాల్సింది ఎన్నికల సంఘం తప్ప ఏసీబీ కాదు.

11)విదేశీ కరెన్సీలో ఎందుకు పంపారు?

మంత్రి హోదాలో కేటీఆర్ కేవలం ఈ రేస్ ఆగకూడదన్న ఉద్దేశంతో డబ్బు బదిలీ చేయాలని హెచ్ఎండీఏను ఆదేశించారు. తప్ప విదేశీ కరెన్సీలో పంపాలా? లేక ఇండియన్ కరెన్సీలో పంపాలా? అనే టెక్నికల్ అంశాలను అధికారులు చూసుకుంటారు. డబ్బును పారదర్శకంగా ప్రభుత్వ బ్యాంక్ ద్వారానే నిర్వాహకులకు బదిలీ చేశారు. నగదు బదిలీలో టెక్నికల్ పొరపాట్లకు ఆర్బీఐ సూచన మేరకు ఫైన్ కుడా ప్రభుత్వం చెల్లించింది.

12) తెలంగాణకు జరిగిన నష్టం?

రేస్ నిర్వాహకులతో దీర్ఘకాలిక ఒప్పందం నుంచి వైదొలగాలనే రేవంత్ ప్రభుత్వం నిర్ణయంతో రూ.55 కోట్లు తెలంగాణ ప్రభుత్వం నష్టపోయింది. కేటీఆర్‌ను, బీఆర్ఎస్‌ను బద్నాం చేయాలనే కుట్రే కారాణం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు విఘాతం కలిగింది. భవిష్యత్తులో అంతర్జాతీయ సంస్థలు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను తెలంగాణలో నిర్వహించాలంటేనే భయపడే స్థితికి వచ్చింది.

13) రేస్ రద్దవకుండా ఉండటానికి నిర్వాహకులు ప్రయత్నించారా?

హైదరాబాద్‌లో 2023లో జరగాల్సిన రేస్‌ను రద్దవకుండా చూసేందుకు నిర్వాహకులు శాయశక్తులా ప్రయత్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఫార్ములా-ఈ సంస్థకో ఫౌండర్ కలిశారు. ఆ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టింది. ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినప్పటికీ మిగతా డబ్బును చెల్లించకపోవడంతో రేస్ రద్దయింది.

14) కేటీఆర్‌పై ఏసీబీ కేసు ఎందుకు?

కాంగ్రెస్ తప్పిదాలను కేటీఆర్ ఎత్తిచూపుతున్నాడన్న అక్కసుతో, రేవంత్ ప్రోద్బలంతోనే ఏసీబీ కేసు నమోదు చేసింది. డబ్బు నిర్వాహకుల బ్యాంక్ అకౌంట్లోనే జమైంది. మనీ లాండరింగ్ జరగలేదు.

నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్

- ముఖ్యమంత్రి డైరెక్షన్‌లో మూడో విడత విచారణ!
- ఢిల్లీలో సీఎంతో ఏసీబీ ఉన్నతాధికారి రహస్య భేటీ?
- కేటీఆర్‌ను అరెస్టు చేస్తే ఎదురయ్యే పరిణామాలపై చర్చ
- న్యాయ నిపుణులతోనూ ఏసీబీ అధికారుల చర్చలు
- 1500 మందితో బంజారాహిల్స్ పరిధిలో బందోబస్తు
- నేడు ఉదయం పది గంటలకు హాజరుకానున్న కేటీఆర్
- ముమ్మాటికీ రాజకీయ కక్షనేనంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాయానికి చేరుకుంటారు. ఫార్ములా-ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం, మరీ ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని కేటీఆర్ మొదటి నుంచీ చెప్తున్నారు. ఈ కేసులో ఎలాంటి అవినీతి లేదని, విచారించదగిన పస లేదని, తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత దృష్టి మరల్చేందుకు తన అనుకూల మీడియాతో ఈ కేసును వండి వార్పుతున్నారని చెప్పారు. దర్యాప్తు సంస్థలు పిలిచినప్పుడు.. చట్టాలను గౌరవించే వ్యక్తిగా తాను హాజరవుతానని చెప్పిన కేటీఆర్.. సోమవారం కూడా విచారణకు రానున్నారు. ఈ కేసులో గతంలో కేటీఆర్‌ను విచారించిన అధికారి డీఎస్పీ మాజీద్ ఖాన్ నేతృత్వంలో ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రుతిరాజ్, అడిషనల్ ఎస్పీలు శివరాం శర్మ, నరేందర్‌రెడ్డి సహా మరో ఇద్దరు కొత్త అధికారులు సోమవారం విచారించనున్నట్టు తెలిసింది. మొత్తం ఆరుగురు విచారణాధికారులు కేటీఆర్‌ను విచారిస్తారని సమాచారం.

సీఎం డైరెక్షన్‌లోనే విచారణ?

ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష పెంచుకున్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే.. ఎలాగైనా కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే ఆలోచనతో ఫార్ములా-ఈ కార్ రేసు కేసును పథకం ప్రకారం తెరపైకి తెచ్చారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తెలంగాణ ఖజానాకు వందల కోట్ల రూపాయల ఆదాయం తెచ్చిన ఫార్ములా-ఈ రేసును పథకం ప్రకారమే రేవంత్ రద్దు చేయించారనే ఆరోపణలు వచ్చాయి. ఆ రేస్‌ను రద్దు చేసిన నాటి నుంచి ఏసీబీతో విచారణ చేయించడం, ఎలాగైనా ఈ కేసును అడ్డం పెట్టుకొని కేటీఆర్‌ను జైలుకు పంపాలనే దురుద్దేశంతోనే ఉన్నారని ఇటు బీఆర్ఎస్ వర్గాలు సైతం చెప్తున్నాయి. అనుభవరాహిత్యంతో పాలనలో వరసగా తప్పిదాలు చేస్తున్న తనను కేటీఆర్ ప్రతిరోజూ ప్రజాక్షేత్రంలో ఎండగడుతుండడాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తూనే ఉన్నారు. ఎప్పటికైనా కేటీఆర్‌తో ప్రమాదమేనని భావించిన సీఎం రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు ఎలాగైనా కేటీఆర్‌ను అరెస్టు చేయించాలనే భావనలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఈ కేసును తన ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

ఢిల్లీలో రహస్య మంతనాలు..

కేటీఆర్‌ను ఫార్ములా ఈ కేసులో ఇరికించేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది. 18 నెలలుగా కేవలం ఈ ఒక్క కేసుపైనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఒక పోలీసు బృందాన్ని కూడా ఏర్పాటు చేసి విచారణ జరిపిస్తున్న విషయం తెలిసిందే!

కేటీఆర్‌ను ఎలాగైనా ఈ కేసులో ఇరికించి జైలుకు పంపాలని పోలీసు అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించినట్టు కూడా ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో తెలంగాణ ఏసీబీకి చెందిన ఓ ముఖ్య ఉన్నతాధికారిని ఇటీవల ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అక్కడికి పిలిపించుకొని మాట్లాడారని విశ్వసనీయ వర్గాల సమాచారం. వారిద్దరూ, ఢిల్లీకి కాంగ్రెస్‌కు చెందిన ఒకరిద్దరు న్యాయ నిపుణులు ఈ అంశంపై కూలంకషంగా చర్చించినట్టు తెలి